క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం



మృతుడు భార్య లక్ష్మికి నగదు అందజేస్తున్న ఎంపీటీసీ భవాని

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన పాట్నూరు శ్రీనివాసరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం గా ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సచివాలయ సిబ్బంది రూ.10 వేలు శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ మిగతా బీమాసొమ్ము రూ.4.90 లక్షలు నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ఎల్. తవుడు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, నాయకులు సీహెచ్ నారంనాయుడు, డి.నాయుడు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి, పాలవలస, పల్లిగండ్రేడు, చింతలపేట గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఎంపీడీఓ కల్యాణి శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా గ్రామాల్లో ఒక్కో వలంటీర్ పోస్టు ఖాళీగా ఉందని, అర్హులు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

దత్తిరాజేరు తహసీల్దార్‌కు బదిలీ

దత్తిరాజేరు: మండల తహసీల్దార్‌గా ఈనెల 21న బాధ్యతలు స్వీకరించిన సుదర్శనరావు రేగిడి మండలానికి శనివారం బదిలీ అయ్యారు. ఇక్కడ డీటీగా పని చేస్తున్న రమేష్‌కు పూర్తిస్థాయి తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రమేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను, కుల, ఆదాయ ధ్రువ పత్రాలను రెండు,మూడు రోజులలో జారీ చేస్తామని చెప్పారు.

అభినందన



విద్యార్థిని గోపికను అభినందిస్తున్న హెచ్ ఎం ఉమామహేశ్వరరావు ,ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైన మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.గోపికను ఆ పాఠశాల హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు,ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 2023వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపధ్యంలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు విజయనగరం కస్పా హైస్కూల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో పదోతరగతి విద్యార్థిని గోపిక ప్రథమ స్థానం సాధించిందని హెచ్‌ఎం చెప్పారు. ఈనెల 25న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఈ విద్యార్థిని హాజరు కానుంది.

గణనాథుడికి గరిక పూజ



గణనాథుడికి సహస్ర గరికపూజ చేస్తున్న పురోహితులు అర్జున్‌శర్మ

లక్కవరపుకోట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమాళి గ్రామంలో ఏర్పాటు చేసిన మండ పంలో గణనాథుడికి పురోహితులు అర్జున్‌శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సహస్ర గరిక పూజ నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కండి



గజపతినగరం: ఎస్.జి.ఆర్.పురం గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రమేష్, తదితరులు



బొండపల్లి: అయ్యన్న అగ్రహారంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు



వేపాడ: వావిలపాడులో గృహ లబ్ధిదారులతో సమావేశమైన ఎంపీడీఓ పట్నాయక్

బొండపల్లి: జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాల ని లబ్ధిదారులకు ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ సూచించారు. హౌసింగ్‌డేలో భాగంగా మండలంలోని అంబటివలస పంచాయతీ పరిధి అయ్యన్న అగ్రహారంలో శనివారం ఇళ్ల నిర్మాణాలను పరిశీ లించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని, గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. హౌసింగ్ ఏఈఈ బి.వి.రమణమూర్తిరాజు, ఉపాధి హామీ ఏపీఓ బి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం..

గజపతినగరం: మండలంలోని అన్ని జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యే క అధికారి రమేష్ సూచించారు. మండలంలోని ఎస్.జి.ఆర్.పురం గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. గజపతినగరం,పురిటిపెంట తదితర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను శత శాతం పూర్తి చేసేలా అధికారులు లబ్ధిదారులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, ఏఓ పి.సుదర్శనం, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

వేపాడ: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణలను త్వరగా పూర్తిచేయాలని, ఇళ్లను ఆనుకుని ఇంకుడు గుంతలు నిర్మించాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కూర్మనాథ్ పట్నాయక్ సూచించారు. మండలంలోని వావిలపాడులో ఇళ్లనిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు గ్రామసచివాలయాన్ని సందర్శించి, ఈసర్వీసులపై సిబ్బందిని ఆరా తీశారు. ప్రజలకు ఆయుష్మాన్ భవ కార్డులు అందజేశారు. అలాగే గ్రామంలోని పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు, పంచాయతీకార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య బోధించాలి

- జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌చంద్ర



మాట్లాడుతున్న జడ్జి విజయ్‌చంద్ర

కొత్తవలస: విద్యార్థులకు ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించాలని, అప్పుడే సమాజంలో నేరాలు తగ్గుతాయని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్‌చంద్ర అన్నారు. మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా పాఠశాలలో సౌకర్యాలు,తరగతి గదులు, వంటశాల, డైనింగ్ హాల్, ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుచు కోవాలని అన్నారు. మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని, సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్, కొత్తవలస,లక్కవరపుకోట ఎస్‌ఐలు బొడ్డు దేవి, ముకుందరావు, న్యాయవాది మహేష్ పాల్గొన్నారు.


వసతి గృహంలో తనిఖీలు



వంటకాలను రుచి చూస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి యశోధనరావు

చీపురుపల్లి: పట్టణంలోని బీసీ సంక్షేమ బాలుర సమీకృత వసతి గృహంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం.యశోధనరావు శనివారం సాయంత్రం తనిఖీలు చేశారు. విద్యార్థులకు రాత్రి భోజనానికి వండిన వంటకాలను రుచి చూశారు. మెనూ ప్రకారం వంటలు చేయడం తో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల డార్మటరీలు, స్టడీ రూమ్‌లను, తాజాగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంజూరు చేసిన నిధులతో నిర్మించిన మరుగుదొడ్ల బ్లాకును పరిశీలించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట వసతిగృహ సంక్షేమాధికారి ఆర్.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



జామి: జామి బీసీ కాలనీలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



జామి: భీమసింగిలో పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి



జామి: ఏ.ఆర్.పేటలో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

జామి: స్థానిక బీసీ కాలనీలోని వినాయక మండపం వద్ద మహిళలు శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అలాగే గొర్లెవీధిలో వినాయక మండపం వద్ద ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మండలంలోని భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి, ఏ.ఆర్.పేట వేణుగోపాలస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు, ఫణిహారం సీతారామాచార్యులు స్వామివార్లకు భక్తులతో అభిషేకాలు, విశేష పూజలు చేయించారు.

పక్కాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



గజపతినగరం: గజపతినగరంలో సర్వేపై సిబ్బందిని ఆరా తీస్తున్న ప్రత్యేక అధికారి రమేష్



మెంటాడ(గజపతినగరం రూరల్): పురిటిపెంటలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా ఎస్సీడీ పథకం అధికారి రవికుమార్



దత్తిరాజేరు: టి.భూర్జవలసలో ఎంపీటీసీకి టోకెన్ అందజేస్తున్న వైద్య సిబ్బంది

గజపతినగరం: గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను పక్కాగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి పి.రమేష్ వైద్య, సచివాలయ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయం–1లో శనివారం ఆయన తనిఖీలు చేశారు. సచివాలయం పరిధిలో ఇంటింటికీ వైద్య సిబ్బంది, వలంటీర్లు వెళ్లి ప్రజల ఆరోగ్యసమాచారాన్ని సేకరించి, వివరాలను యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి, అక్టోబర్ 5న నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపునకు హాజరయ్యే విధంగా టోకెన్‌లు అందించాలని సూచించారు. ఆయన వెంట మండల పరిషత్ కార్యాలయ సీనియర్ పరిపాలన అధికారి పప్పు సుదర్శనం, గజపతినగరం సర్పంచ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎం.రమణ, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

దత్తిరాజేరు: ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని టి.భూర్జవలస ఎంపీటీసీ దంపతులు మంత్రి అప్పలనాయుడు,సుధారాణి అన్నారు. టి.భూర్జవలసలో వైద్యసిబ్బంది శనివారం చేపట్టిన ఆరోగ్య సురక్ష సర్వేను వారు పర్యవేక్షించారు. గ్రామస్తులతో పాటు బీపీ, సుగర్ తదితర వైద్యపరీక్షలు చేయించుకున్నారు. గ్రామంలో ఈనెల 30 మెడికల్ క్యాంపు నిర్వహించనున్నామని, స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారని సిబ్బంది చెప్పారు. అనంతరం ఆరోగ్య సమస్యలున్నవారికి మెడికల్ క్యాంపునకు హాజరు కావాలని టోకెన్‌లు అందజేశారు.

ప్రతీ వ్యక్తికి మెరుగైన వైద్యం

మెంటాడ(గజపతినగరం రూరల్): ఆరోగ్యసమస్యలున్న ప్రతీ వ్యక్తికి గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరిట మెడికల్ క్యాంపులను త్వరలో నిర్వహించనుందని జిల్లా ఎస్సీడీ పథకం అధికారి డాక్టర్ రవికుమార్ అన్నారు. పురిటిపెంట గ్రామ సచివాల యం–2 పరిధిలో వైద్యసిబ్బంది, వలంటీర్లు శనివారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి కీ వెళ్లి ప్రజలకు హిమోగ్లోబిన్, బీపీ, సుగర్, తదితర వైద్య పరీక్షలు చేయాలని, ప్రజల ఆరోగ్యసమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట డీపీఎంఓ దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

నెలాఖరులోగా ఈ-క్రాప్ చేసుకోండి

బొండపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల సాగు వివరాలను ఈనెలాఖరులోగా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని రైతులకు ఏఓ పి.వి.మల్లికార్జునరావు శనివారం ఓ ప్రకటనలో సూచించారు. రైతులు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో వీఏఏలు, వీహెచ్‌ఏలను సంప్రదించి ఆధార్‌కార్డు, వన్‌బీ, లేదా భూమి పాస్‌బుక్ జెరాక్స్ పత్రాలను అందజేస్తే వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఈ–క్రాప్ చేసుకుంటేనే పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అలాగే అతివృష్టి, అనావృష్టికి పంటలు దెబ్బతింటే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని తెలిపారు.